



# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 7 సంచిక : 228

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శనివారం 20 జనవరి 2024




## పోరాటానికి రూపమే అంబేద్కర్

● పెత్తందారులకు దళితులంటే చులకన ●రాష్ట్రాన్ని దోచుకోవడమే పెత్తందారుల లక్ష్యం ● బీసీ, ఎస్సీ, ఎస్టీలపై చంద్రబాబుకు ఏ కోశానా ప్రేమలేదు ● అంబేద్కర్ భావజాలం పెత్తందారులకు నచ్చదు ● చంద్రబాబుకు దళితులంటే నచ్చదు ● ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సామాజిక సమతా సంకల్ప సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ● విజయవాడలో 125 అడుగుల ఎత్తయిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం జగన్ ● విజయవాడ స్వరాజ్య మైదానంలో భారీ అంబేద్కర్ విగ్రహం● విగ్రహాన్ని జాతికి అంకితం చేసిన ఏపీ సీఎం జగన్









**విజయవాడ,కలంకౌంటర్ :** పోరాటానికి రూపమే డాక్టర్ బీఆర్ అం బేద్కర్ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీర్తి ంచారు. పెత్తందారుల పత్రికలు చరిత్రను కూడా వక్రీకరిస్తున్నాయని, ఎల్లో మీడియాను చూస్తే పాత్రికేయం ఏ స్థాయికి దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండి పడ్డారు. శుక్రవారం ఆయన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సామాజిక సమతా సంకల్ప సభలో మాట్లాడుతూ పేదవాడి పిల్లలు ఎప్పటికీ పనివాళ్లుగా ఉండిపోవాలా? అంటూ ప్రశ్నించారు. పేదలు చదివే ప్రభుత్వ స్కూళ్లను పట్టించుకోకపోవడం అంటరానితనమే. పేదలకు ఇళ్లు ఇస్తుంటే అడ్డుకోవడం కూడా అంటరానితనమే. పేదపిల్లలకు ట్యాబ్‌లు ఇస్తుంటే కుట్రపూరిత వార్తలు రాయడం అంటరానితనమే. దళితులకు చంద్రబాబు సెంటు భూమి కూడా ఇచ్చింది లేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీలపై చంద్రబాబుకు ఏ కోశానా ప్రేమలేదు. ప్రభుత్వం బడుల రూపురేఖలు మారిస్తే పెత్తందారులకు నచ్చడం లేదు. అంబేద్కర్ భావజాలం పెత్తందారులకు నచ్చదని సీఎం జగన్ దుయ్యబట్టారు. పెత్తందారులకు దళితులంటే

## మూసీ పునరుజ్జీవానికి థేమ్స్ ప్లాన్

● లండన్ టూర్ లో సీఎం రేవంత్ రెడ్డి ●థేమ్స్ రివర్ పాలక మండలితో చర్చలు ● రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు సహకారం



**తెలంగాణ, కలంకౌంటర్ :** మూసీ నది పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇతర దేశాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను తెలుసుకునేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి లండన్ లో పర్యటించారు. లండన్ లోని థేమ్స్ నదిని సందర్శించారు. థేమ్స్ నది నిర్వహిస్తున్న తీరును, అక్కడి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధి చేసిన తీరును ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం అక్కడి థేమ్స్ రివర్ పాలక మండలి, పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ అధికారులు, నిపుణులతో దాదాపు మూడు గంటల పాటు చర్చలు జరిపారు. దశాబ్దాలుగా వివిధ దశల్లో థేమ్స్ నదీ తీరం వెంట చేపట్టిన సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను అక్కడి కార్పొరేట్ అఫైర్స్ డైరెక్టర్ సియాన్ ఫోస్టర్, ఫోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ హెడ్ రాజ్ కెహల్ లివీ సీఎంకు వివరించారు. అందులో భాగంగా ఎదురైన సవాళ్లు, పరిష్కారాలు, ఖర్చయిన నిధులు, భాగస్వామ్యమైన సంస్థలు, అందంగా తీర్చిదిద్దేందుకు అనుసరించిన అత్యుత్తమ విధానాలన్నీ ఈ సందర్భంగా చర్చించారు. 'నదులు, సరస్సులు, సముద్ర తీరం వెంట ఉన్న నగరాలన్నీ చారిత్రాత్మకంగా అభివృద్ధి చెందాయి. హైదరాబాద్ సిటీకి అటువంటి ప్రత్యేకత ఉంది. అటు మూసీ నది వెంబడి, ఇటు హుస్సేన్ సాగర్ చుట్టూ, ఉస్మాన్ సాగర్ లాంటి నదీ వ్యవస్థ కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందింది. పునరుజ్జీవ ప్రాజెక్టు ద్వారా తిరిగి మూసీకి పునర్వైభవం తీసుకు వస్తే నదులు, సరస్సులతో హైదరాబాద్ మరింత శక్తివంతంగా తయారవుతుంది...' అని ముఖ్యమంత్రి వివరించారు. తన విజన్ 2050 కు అనుగుణంగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి లండన్ అధికారులు సానుకూలతతో చర్చలు జరిపారు. నదీ ఒడ్డున అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నదీ సంరక్షణకు అత్యున్నత ప్రాధాన్యమిచ్చినట్లు అక్కడి అధికారులు వివరించారు. నదీ జలాలను సుస్థిరంగా ఉంచటం, ఎంచుకున్న ప్రాజెక్టు ద్వారా స్థానికులకు ఎక్కువ ప్రయోజనముండే రెవిన్యూ మోడల్ ను ఎంచుకోవాలని చెప్పారు. ఈ ప్రాజెక్టును మరింత అత్యుత్తమంగా తీర్చిదిద్దే కొత్త విధానాలు ఎప్పటికప్పుడు గమనించటంతో పాటు, ప్రాజెక్టు నిర్వహణపై నిరంతరం దృష్టి పెట్టాలన్నారు. హైదరాబాద్ లో మూసీ నదిని పునరుజ్జీవింపజేసేందుకు చేస్తున్న అన్ని ప్రయత్నాలకు తమ మద్దతు ఉంటుందని పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ హామీ ఇచ్చింది. ఇదే సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన అవుట్ లైన్, వివిధ సంస్థల భాగస్వామ్యంపైనా చర్చించారు. ఈ ప్రాజెక్టుకు నిర్దిష్టమైన సహకారం అందించేందుకు భవిష్యత్తులో మరిన్ని చర్చలు జరపాలని ఇరు పక్షాల మధ్య అంగీకారం కుదిరింది. సీఎం రేవంత్ రెడ్డితో పాటు సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, సీఎం స్పెషల్ సెక్రెటరీ బి.అజిత్ రెడ్డి, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్, మూసీ రివర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ అమ్రాపాలీ, ఇన్వెస్ట్ మెంట్స్ అండ్ ప్రమోషన్స్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్ రెడ్డి, మూసీ రివర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ ఎస్ఈ వెంకట రమణ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## జగన్ వెయ్యి తప్పులు చేశారు.. ఇంకా భరిస్తారా?

● ఏం చేశారని విశ్వసనీయత గురించి మాట్లాడుతున్నారు ● ఓటు అనే ఆయుధాన్ని ప్రజలు ఉపయోగించాలి ● క్లబ్బు డ్యాన్సర్లు కూడా సంక్షేమం గురించి మాట్లాడడమా ● తిరుపతి జిల్లా వెంకటగిరిలో రా కదలిరా సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు








**వెంకటగిరి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఏ వర్గమూ సంతోషంగా లేదని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని, 82 రోజుల్లో పతనం తప్పదన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో నిర్వహించిన 'రా.. కదలిరా..' సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. జగన్‌ను గద్దె దించి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. 'రా.. కదలి రా..' అని పిలుపిస్తే వెంకటగిరి గర్జించింది. జగన్ రాజకీయ వ్యాపారి. మనందరినీ పెట్టుబడిగా పెట్టి రాష్ట్రాన్ని దోచేస్తున్నారు. వైసీపీలో ఉంటూ జగన్ పాలన బాగోలేదని ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ప్రజాహితం కోసం మాట్లాడితే ఆయన్ను దూరం పెట్టేశారు. సీనియర్లను కూడా లెక్కచేయని అహంకారం జగన్‌ది. ఈ సీఎం వెయ్యి తప్పులు చేశారు..ఇంకా భరిస్తారా? జీతం కోసం అడిగితే ఉద్యోగులు జైలుకు వెళ్లే పరిస్థితి రాష్ట్రంలో ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక వెంకటగిరి తలరాత మారిందా? 25 ఏళ్ల క్రితం యువతకు ఐటీ అనే ఆయుధమిచ్చా. అదే ఇప్పుడు వజ్రాయుధమైంది. టీడీపీ హయాంలో తిరుపతిని మొబైల్ హబ్‌గా తీర్చిదిద్దాం. ఓటు అనే ఆయుధాన్ని ప్రజలు ఉపయోగించాలి" అని చంద్రబాబు కోరారు.

## పవన్ కళ్యాణ్ ను కలిసిన ఎంపీ బాలశౌరి, తనయుడు అనుదీప్



**విజయవాడ,కలంకౌంటర్ :** ఎంపీ బాల శౌరి గుంటూరు లేదా మచిలీపట్నం లలో ఎక్కడ నుంచి పోటీలో ఉంటారనే విషయం చర్చనీయాంశం గా మారింది. ఇటీవలే వైసీపీ కి రాజీనామా చేసి జనసేన లో చేరబోతున్న సందర్భంగా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ను కలవడం ప్రాధాన్యత గా మారింది. ఏ విషయాలు చర్చించారో అంటూ రకరకాల అభిప్రాయాలు విన్పిస్తున్నాయి.

## అంబేద్కర్ గురించి ఇంత చేసిన సీఎం దేశంలో లేరు :హెూంశాఖ మంత్రి తానేటి వనిత



**విజయవాడ,కలంకౌంటర్ :** అంబేద్కర్ గురించి ఇంత చేసిన సీఎం దేశంలో లేరని హెూం శాఖా మంత్రి తానేటి వనిత అన్నారు. ఈ రోజు స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ ఆవిష్కరణ జరుగుతుంది. ప్రపంచంలోనే అతి ఎత్తైన మహా శిల్పాన్ని రూపొందించడం..ఇందులో తనకు అవకాశం కల్పించిన సీఎంకి ధన్యవాదాలు తెలిపారు. అంబేద్కర్ ఆశయాలు, పోరాటాల గురించి మనం చరిత్ర పుస్తకాల్లో చదివామని, కానీ అవి అమలుచేసిన చరిత్ర మన సీఎందన్నారు. ఆయన సిద్ధాంతాలు, ఆశయాలు, ఆలోచనలు, సంస్కరణలు, పోరాటాలు జగనన్న ముందుకు తీసుకెళ్తున్నారని, మనమంతా కూడా జగనన్నకు అండగా ఉండాలని, తోడుగా ఉండాలని కోరారు.

# 3మూడో రోజు కొనసాగిన స్వచ్ఛ తీర్థ కార్యక్రమం



**సింహాచలం.కలంకౌంటర్ :** శ్రీ వరాహలక్ష్మి నరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఎండోమెంట్ కమిషనర్ ఎస్ సత్యనారాయణ ఆదేశాలు మేరకు వారం రోజుల పాటు "స్వచ్ఛ తీర్థం" ప్రచార కార్యక్రమాన్ని మూడవరోజు కూడా కొనసాగించారు ఆలయ ఈవో ఎస్ శ్రీనివాస్ మూర్తి స్వచ్ఛ తీర్థ కార్యక్రమం గురువారము ప్రధాన ఆలయం ఎదురుగా గల కాశీ విశ్వేశ్వర ఆలయ పరిశ్రలను పరిశుభ్రత నిర్వహించడం జరిగింది కార్యనిర్వహణాధికారి ఎస్ శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు ఆలయ ఏఈవో భ్రమరాంబ అన్నదానం ఏఈఓ నర్సింగరావు శానిటరీ పర్యవేక్షణాధికారి లక్ష్మీ ప్రసన్న శానిటరీ సూపర్వైజర్ రామకృష్ణ ఆలయ పర్యవేక్షణ అధికారి కనకరాజు పి ఆర్ ఓ నాయుడు తదితరులు ఆలయ పరిసరాలను శుభ్రపరిచారు ఆలయ కొత్తవాల్ నాయకులు లంక సూరిబాబు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పీసీసీ చీఫ్ షర్మిల ఏపీ పర్యటన షెడ్యూల్ ఖరారు

- ఈ నెల 20, 21 తేదీల్లో ఏపీలో పర్యటించనున్న షర్మిల
- 20న ఇడుపులపాయలో బస చేయనున్న షర్మిల
- 21న విజయవాడలో పీసీసీ చీఫ్ గా బాధ్యతల స్వీకరణ



**విజయవాడ,కలంకౌంటర్ :** ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తొలిసారి ఏపీలో పర్యటించబోతున్నారు. రెండు రోజుల పాటు ఏపీలో ఆమె పర్యటించనున్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఆమె పర్యటన కొనసాగనుంది. ఈ నెల 20న మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఆమె కడపకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఇడుపులపాయకు చేరుకుని సాయంత్రం 4 గంటలకు తన తండ్రి వైఎస్సార్ సమాధి వద్ద నివాళులు అర్పిస్తారు. ఆరోజు రాత్రి అక్కడే బస చేస్తారు. 21వ తేదీ ఉదయం కడప నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి ఉదయం 10 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం ఉదయం 11 గంటలకు విజయవాడలో పీసీసీ చీఫ్ గా ఆమె బాధ్యతలను స్వీకరిస్తారు. ఇటీవలే కాంగ్రెస్ లో చేరిన షర్మిలకు పార్టీ హైకమాండ్ ఏపీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించింది. గిడుగు రుద్రరాజు స్థానంలో పీసీసీ చీఫ్ గా నియమించింది. రుద్రరాజు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమితులయ్యారు.

# కోవర్ట్ నాని ఎక్కడున్నా చేసేది అదే: టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా



**విజయవాడ,కలంకౌంటర్ :** టీడీపీకి గుడ్ బై చెప్పి వైసీపీ పంచన చేరిన విజయవాడ ఎంపీ కేశినేని నానీపై టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా ధ్వజమెత్తారు. టీడీపీలో ఉన్నప్పుడు చంద్రబాబు పక్కన నిలబడ్డ వ్యక్తి, నేడు వైసీపీ ఛోటా నాయకుల భజన చేసే దుస్థితికి వచ్చాడని విమర్శించారు. కల్తీ మద్యం క్వార్టర్ రూ.200లకు ఎందుకు అమ్ముతున్నారో, లారీ ఇసుక రూ.12 వేలు అంతకుమించి అమ్మడంపై కేశినేని నానీ మాట్లాడాలని నిలదీశారు. తెలంగాణలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి రూ.150 కోట్లు ఖర్చయితే, జగన్ రెడ్డి సర్కార్ రూ.400 కోట్లు ఎందుకు ఖర్చు పెట్టిందో నానీ చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో నానీపై టీడీపీ అభ్యర్థి 2 లక్షల మెజారిటీతో గెలవడం ఖాయమని నాగుల్ మీరా స్పష్టం చేశారు. కనకదుర్గ ఫ్లైఓవర్ నిర్మాణంలో నానీ పాత్ర చంద్రబాబుకి కాగితాలు అందించడమేనని అన్నారు. తెలుగుదేశంలో ఉన్నప్పుడు కేశినేని నానీకి మోసగాడిగా, ద్రోహిగా కనిపించిన జగన్ రెడ్డి, నేడు గొప్ప వ్యక్తిగా కనిపించడం హాస్యాస్పదమని అన్నారు. పీఆర్పీ, టీడీపీల మాదిరే త్వరలోనే వైసీపీ కూడా నానీని భరించలేమనే స్థితికి వస్తుందని, నానీకి నైతిక విలువలు లేవు అనడానికి అతను చేస్తున్న వ్యాఖ్యలే నిదర్శనమని నాగుల్ మీరా పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే మొదట ప్రారంభమయ్యేది రాజధాని పనులేనని నానీ తెలుసుకోవాలన్నారు.

# జనవరి 19 అంబేద్కర్ డేగా చరిత్రలో నిలిచిపోతుంది





**గుడివాడ,కలంకౌంటర్ :** విజయవాడలో జరగనున్న భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం మరియు స్మృతివన ప్రారంభోత్సవ వేడుకలు కృష్ణాజిల్లా గుడివాడలో ఘనంగా జరిగాయి.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కొడాలి నాని,వేడుకల బైక్ ర్యాలీ ప్రారంభించారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన అంబేద్కర్ విగ్రహం మన విజయవాడలో ప్రారంభం కావడం, అంతటి గొప్ప కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం సంతోషకరమని ఎమ్మెల్యే కొడాలి నాని హర్షం వ్యక్తం చేశారు. విగ్రహ ప్రారంభోత్సవ వేడుకల్లోఎంపీపీ పెయ్యల అదాం, మార్కెట్ యార్డ్ చైర్మన్ మట్టా నాగమణి జాన్ విక్టర్ పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేమల్లి నిలాకాంత్, నేతలు ఏలేటి విలియం జోషి, వేంపటి సైమన్, జిల్లా యూత్ అధ్యక్షుడు మేరుగుమాల ఖాళీ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల భాస్కరరావు, వైసిపి నాయకులు అగస్త్యరాజు కృష్ణ మోహన్, రమణకుమార్,తోట రాజేష్, గుదె రవి,ఆర్కే, నైనవరపు శేషు బాబు, మాదాసు వెంకటలక్ష్మి, సింగిరెడ్డి గగారిన్, మామిళ్ళ ఎలీషా, మెండెం చంద్రపాల్, మేండా రవికుమార్,పింకీ పెద్ద సంఖ్యలో యువత, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# వేమన చెప్పిందే వేదం...

- ప్రజాకవిగా, మానవతావాదిగా చిరస్మరణీయుడు వేమన...
- ధృతి సంస్థ అధ్యక్షులు కళ్ళం హరినాథ్ రెడ్డి..

**పిట్టలవాని పాలెం(బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** నేడు ధృతి సాహిత్య సంస్కృతిక సామాజిక సంస్థ నిర్వహణలో వేమన జయంతి.. సాహిత్య సభ రామానుజకూటమి యాత్రినివాస్ నందు ఘనంగా నిర్వహించిన... ధృతి సంస్థ అధ్యక్షులు కళ్ళం హరినాథ్ రెడ్డి...... యోగివేమనను కవిత్వంలో సామాజిక చైతన్యం తీసుకొచ్చిన గొప్ప విప్లవకారునిగా, దైవాంశ సంభూతుడిగా భావించిన నాటి జనం 'వేమన చెప్పిందే వేదం' అనుకునేవారు. యవ్వనంలో అన్ని భోగాలనూ అనుభవించి ఆ తర్వాత విరాగిగా మారి ఊరూరా తిరిగి ప్రజలకు సత్యమార్గాన్ని చూపెట్టిన ఆయన జీవితంపై ఎన్నో చిత్రాలు వచ్చాయి. వేమన స్మృత్యర్థం కేంద్ర ప్రభుత్వం ఓ స్టాంపును కూడా విడుదల చేసింది. అలాంటి ఆయన పేరిట బాపట్లలో రామానుజా కూటమిలో శుక్రవారం నాడు ధృతి సాహితీ అధ్యక్షులు కళ్ళం హరినాద్ రెడ్డి ఆధ్వర్యంలో వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూబీ సరళీకృత భాషతో సమాజ చైతన్యం ప్రజా కవిగా.. సంస్కరణాభిలాషిగా.. కులాన్ని నిరసించిన మానవతా వాదిగా.. మీదు మిక్కిలి పరభాషా ఆధిపత్యాన్ని ప్రశ్నించి తెలుగు భాషకు ఎనలేని సేవ చేసిన మహనీయుడిగా.. తెలుగు వారి గుండెల్లో చిరస్మరణీయుడైన వేమన గురించి తెలియని ఆంధ్రుడు ఉండడు అనడంలో అతిశయోక్తి లేదు. ఒకనాడు పండితులకు మాత్రమే అర్థమయ్యే సాహితీ సౌందర్యాలను తనదైన అద్భుత ప్రజ్ఞతో సరళీకృతమైన భాషలో అందించి సమాజాన్నంతటినీ ప్రభావితం చేసిన ప్రజాకవి వేమారెడ్డి. యోగి వేమనగా సుప్రసిద్ధులైన ఆయన పామరుడి నుంచి మహా పండితుల వరకు అందరికీ అర్థమయ్యేలా కవితా శక్తిని క్రోడీకరించుకుని జీవిత సత్యాలను, మానవతా విలువలను తెలుగు వారందరికీ అందించి ప్రజాకవిగా ప్రఖ్యాతి పొందారు. దుష్ట సంప్రదాయాలను, మూఢాచారాలను, విగ్రహారాధనలను, కుల వివక్షను, మత మౌఢ్యాలను, స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను... ఇలా ఒకటేమిటి సమాజానికి హాని కలిగించే అన్నింటినీ సూటిగా, ఘాటుగా విమర్శించి ప్రజలను ఉత్తేజితులను చేశారు. ఆటవెలదులనే తూటాలుగా మార్చి మూఢాచారాలపై చైతన్య బావుటా ఎగురేసిన గురజాడ, కందుకూరి, జ్యోతిరావుపూలే, పెరియార్ వంటి సంస్కరణవాదులకు పూర్వ రంగం సిద్ధం చేసింది వేమనే. 'ఉప్పు కప్పురంబు ఒక్క పోలికనుండు చూడ చూడ రుచుల జాడ వేరు.. పురుషులందు పుణ్యపురుషులు వేరయా..పేదవాని ఇంట పెండ్లయిన ఎరుగరు..' వంటి జీవిత సత్యాలను తెలిపే తెలుగు పద్యాలతో సంఘంలోని ఆర్థిక అవినీతిని మధ్యయుగం నాడే ఖండించిన మహానుభావుడు ఆయనేనని కొనియాడారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త బేరం సుందరరావు మాట్లాడుతూ వేమన ప్రపంచ కవి... వేమన ప్రపంచానికి ఆదర్శంగా ప్రజలందరినీ చైతన్య పరచడంలో ఆయన పద్యాలు ఎంతో దోహదం చేశాయని, వేమన జీవితం జిల్లాతో మమేకం వర్షంలో తడవని వారుంటారేమో కానీ వేమన పద్యాలు వినని తెలుగువారుండరని మహాకవి శ్రీశ్రీ అన్నట్టు వేమన పద్యాలు అంతగా జగత్ ప్రసిద్ధాలయ్యాయి. గండికోటను పాలించే గడ్డంరెడ్డి మూడవ సంతానంగా వేమారెడ్డి 1652లో జన్మించారని చరిత్ర చెబుతోంది. జన్మస్థలంపై కచ్చితమైన సమాచారం లేకున్నా ఆయన 1730లో కదిరి ప్రాంతంలో సమాధి అయిన మాట వాస్తవం. ఇప్పటికీ ఆయన సమాధి అయిన కదిరి మండలంలోని కటారుపల్లె పర్యాటక క్షేత్రంగా




భాసిల్లుతోంది. అశాస్త్రీయమైన సమాజాన్ని సమూలంగా మార్చడానికి ప్రయత్నం చేసిన యోగి వేమన సాహిత్యాన్ని సుప్రసిద్ధం చేయడానికి మనమందరం ఏకమవ్వాలని అన్నారు. విశిష్ట అతిథి చీఫ్ మార్షల్ ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ దుండి ఏడుకొండలు రెడ్డి మాట్లాడుతూ ప్రజాకవి వేమన రచించిన పద్యాలు చాలావరకు కనుమరుగైపోయినా లభించిన వాటితోనే అద్భుతాలు ఆవిష్కారమవుతున్నాయంటే అన్నీ దొరికితే మరెంత బావుంటుందో చెప్పలేము. 'ద వర్సెస్ ఆఫ్ వేమన' అంటూ ఓ ఆంగ్లేయుడు ఆయన పద్యాలను ఆంగ్లంలోకి అనువదించి తెలుగు భాషకు గొప్ప సేవ చేశారు. వేమన తెలుగుకు పరిమితమైన కవి మాత్రమే కాదు ప్రపంచ కవి. వేమన పద్యాలతో జీవితాన్ని సరిదిద్దుకోవచ్చు. ఉత్తమ సమాజాన్ని నిర్మించుకోవచ్చు ఆయన అన్నారు. ముఖ్య అతిథి బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ వి. శ్రీనివాసరావు మాట్లాడుతూబీ వేమన పద్యాలు భారతదేశంలోనే కాకుండా లండన్ ఫ్రాన్స్ ఇంగ్లాండ్ దేశాలలో కూడా ఆయన పేరు మీద గ్రంథాలయాలు ఉన్నాయంటే వేమన పద్యాలు మనిషి జీవన విధి విధానాలను అనుసరించి ఆనాడే వేమన పద్యాలు ఎందరకు ఆదర్శంగా ఉన్నాయని అన్నారు. సాంస్కృతి కార్యక్రమాలకు విద్యాలయాలకు అనేక సేవా కార్యక్రమాలకు పుట్టినిల్లుగా బాపట్ల ప్రాంతం విరాజుల్లుతుందని, బాపట్ల అగ్రికల్చర్ కళాశాలలో చదువుకున్న ఎందరో విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వాలలో చీఫ్ సెక్రటరీగా పనిచేసిన మేధావులు అజయ్ కళ్ళం, 1984 సంవత్సరంలో చదువుకున్న తోట రవి అనే విద్యార్థి అస్సాం రాష్ట్ర చీఫ్ సెక్రెటరీగా నియమితులైనరు. అలాగే బాపట్ల ప్రాంతంలో చదువుకున్న ఎందరో మేధావులు ఇతర దేశాలలో సైంటిస్టులు ప్రొఫెసర్లు గా దేశంలో అత్యంత కీలకమైన పదవుల్లో ఉన్నారని బాపట్ల ప్రాంతాన్ని మనమందరం అభివృద్ధి చేసుకోవాలని ఆయన అన్నారు. ప్రజలందరూ చైతన్య పరుస్తూ వేమన జయంతి ధృతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించడం చాలా సంతోష దాయకమని ధృతి సంస్థ వారందరినీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు చీరాల వెంకటేశ్వర రెడ్డి, చీరాల నియోజకవర్గం రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు భవనం బద్రి రెడ్డి, రెడ్ క్రాస్ నారాయణ బట్టు, బాబు నాగేంద్ర, డాక్టర్ శ్రీనివాసరావు, అడవుల దీవి మాజీ సర్పంచి బొద్దు సుబ్బారెడ్డి, ముదుగు అక్కిరెడ్డి, చల్లా రాజు కటికల రమేష్, జాలి రామిరెడ్డి, వేమన అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి

-విజయవాడ, కలంకౌంటర్ :

# ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడుగా చెరుకూరి



**స్పోర్ట్స్ ప్రతినిధి,కలంకౌంటర్ :** ఢిల్లీలో శుక్రవారం జరిగిన ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఎన్నికల్లో ఆంధ్ర ప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడుగా పోటీ చేసిన చెరుకూరి సత్యనారాయణ అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. సత్యనారాయణ ఓల్గా ఆర్చరీ అకాడమీ స్థాపించి ఆర్చరీ అభివృద్ధికి కృషి చేసి పలువురు ఉద్యోగాల్లో స్థిర పడటానికి దోహదపడ్డారు. చెరుకూరి సత్యనారాయణ ఆర్చరీకి చేసిన సేవలకు మంచి గుర్తింపు లభించిందని పలువురు ఆనందం వ్యక్తం చేశారు. సత్యనారాయణ ఎంపిక పట్ల ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ సభ్యులు, కృష్ణాజిల్లా ఆర్చరీ అసోసియేషన్ సభ్యులు, అమరావతి నెట్ బాల్ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు, వివిధ కళాశాలల వ్యాయామ విద్యా సంచాలకులు, తదితరులు అభినందించారు.

# ప్రాంతీయ కార్యదర్శి గా బొగ్గవరపు శ్రీనివాస్



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రాంతీయ కార్య దర్శిగా చల్లపల్లి మండలం లక్ష్మీపురం కు చెందిన బొగ్గవరపు శ్రీనివాస్ ని ప్రాంతీయ కార్యదర్శిగా నియమించినట్లు కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి నాగ సాయి శ్రీనివాస్ ( సాయి) ఒక ప్రకటన లో తెలిపారు.

# నాకు తిరువూరు సీటు ఇవ్వకపోవడం పట్ల నా మనసు గాయపడింది

- తిరువూరు ఎమ్మెల్యే రక్షణ నిధి

**విజయవాడ,కలంకౌంటర్ :** ఒక ఎంపీ చెప్పిన మాట విని.. ఒక ప్రణాళిక ప్రకారం.. రెండుసార్లు గెలుపొందిన నాకు సీట్ లేకుండా చేశారు. నా నిర్ణయం రెండు రోజుల్లో ప్రకటిస్తా నేను పోటీ చేయడం ఖాయం.. ఎక్కడి నుంచి చేస్తాను అన్నది త్వరలో తెలియపరుస్తా నేను ఈ పది సంవత్సరాల రాజకీయ చరిత్రలో చంద్రబాబు నాయుడు కానీ, లోకేష్ పవన్ కళ్యాణ్ ను కానీ దూషించిన సందర్భాలు లేవు అది కూడా ఒక కారణం కావచ్చు అని నేను భావిస్తున్నాను వారి ప్రణాళికలు ముందుగానే పసిగట్టి 20 రోజుల నుంచి నేను నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నాను.

# పవన్‌కల్యాణ్‌తో ఎంపీ బాలశౌరి భేటీ



**హైదరాబాద్,కలంకౌంటర్ :** జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి భేటీ అయ్యారు. వైసీపీకి రాజీనామా చేసిన ఆయన జనసేనలో చేరనున్నట్లు ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో పవన్‌తో బాలశౌరి భేటీ అయ్యారు. ఏపీలో తాజా రాజకీయ పరిస్థితులపై వీరిద్దరూ చర్చించినట్లు సమాచారం. సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడైన బాలశౌరి వైసీపీకి రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. ఆయన బందరు నుంచి బరిలోకి దిగుతారా? లేదా సొంతూరు గుంటూరుపై గురిపెట్టారా? అన్న చర్చ జోరుగా సాగుతోంది.

# హిందూ ఐక్యత చాటుదాం..

- ఉదయం సంకీర్తనలు, భజనలు, కోలాటాలు, విగ్రహ ప్రతిష్ట లైవ్ ప్రదర్శన
- సాయంత్రం విగ్రహాల ఊరేగింపు, జ్యోతుల ఊరేగింపు






**మచిలీపట్నం కల్చరల్,కలంకౌంటర్ :** అయోధ్యలో ఈనెల 22వ తేదీన జరిగే రామ్ లల్లా విగ్రహ ప్రతిష్ట సందర్భంగా నగరంలో నిర్వహించే కార్యక్రమాల్లో హిందువులందరూ పాల్గొని ఐక్యత చాటాలని విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ ఘనపాఠి పిలుపునిచ్చారు. హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బృందావనపుర కళ్యాణ మండపంలో జరిగిన విలేకరుల సమావేశంలో సూర్యనారాయణ శర్మ ఘనపాఠి మాట్లాడుతూ నాలుగు వందల యాభై సంవత్సరాల నుంచి హిందువులందరూ కంటున్న కల ఈనెల 22వ తేదీన సాకార మవుతున్నదన్నారు. యుగ పురుషుడు, ధర్మ స్వరూపుడు, సాధు జీవనుడు, సుపరిపాలకుడు అయిన రాముడు జన్మించిన, నడయాడిన చోట నిర్మించిన భవ్యమైన దివ్యమైన రామ మందిరంలో రామ్ విగ్రహ ప్రతిష్ట కన్నుల పండుగగా జరగడం మన అందరి అదృష్టం అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు నిర్వహించే ఈ కార్యక్రమానికి విశ్వవ్యాప్తంగా ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా నగర నడిబొడ్డు అయిన చారిత్రాత్మక కోనేరు సెంటర్లో ఉదయం గం. 9:30 నుండి నామ సంకీర్తనలు, భజనలు, కోలాట ప్రదర్శనలు, అయోధ్యలో జరిగే ప్రతిష్టా కార్యక్రమం లైవ్ ప్రదర్శన జరుగుతా యన్నారు. సాయంత్రం గం 6:30 లకు విగ్రహాల ఊరేగింపు, జ్యోతుల ఊరేగింపు, శ్రీ సీతారామ కళ్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లక్షల దిగా ప్రజలు తరలిరావాలని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం కార్యదర్శి మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ మాట్లాడుతూ అయోధ్యలో జరిగే ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి దేశ విదేశాల ప్రముఖులు భాగస్వాములు విచ్చేస్తున్నారన్నారు. నగరంలోని పండితులు, వ్యాపార వర్గాలు, అన్ని వర్గాలకు చెందిన ప్రజలు కుల మతాలకు అతీతంగా పాల్గొనాలని కోరారు. మచిలీపట్నం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్, బృందావన గో సంరక్షణ సంఘం కార్యదర్శి పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వర రావు మాట్లాడుతూ భగవంతుడే మానవ రూపంగా అవతరించిన రామ్ లల్లా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం మన ఊరి పండగ అన్నారు. ఈ సందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నృసింహ సోమయాజి వైశ్య సమాజం ప్రధాన కార్యదర్శి గుడివాడ మెహెర్ ప్రసాద్, వ్యాపారవేత్తలు జల్లూరి గోపి, బచ్చుపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్త ఊర రామాంజనేయులు, సామ కుమారి తదితరులు పాల్గొన్నారు.



# భువనేశ్వర్ పర్యటనలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారుల బృందం



**గుంటూరు,కలంకౌంటర్ :** నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణ శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారుల బృందం వారి రెండు రోజుల భువనేశ్వర్ పర్యటనలో భాగంగా రెండో రోజు శుక్రవారం బహుళ ప్రభుత్వాల, యునెస్కో, ప్రపంచ బ్యాంకు నీతి ఆయోగ్ ల గుర్తింపు పొందిన మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంట్రప్రెన్యూర్షిప్ యొక్క సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అయిన "సెంచురియన్ యూనివర్సిటీ" ను సందర్శించింది. అక్కడ అందిస్తున్న శిక్షణల వివరాలను అడిగి తెలుసుకుని, శిక్షణ తరగతులను, ప్రయోగశాలను, నెలకొని ఉన్న పరిశ్రమలను సందర్శించి, శిక్షణ పొందుతున్న విద్యార్థులతో సంభాషించారు. అనంతరం ఉషా పాధీ ని కలిసి నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించడంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను, తదుపరి అంశాలను గూర్చి వారితో సంభాషించారు. ఈ కార్యక్రమంలో, నైపుణ్యాల అభివృద్ధి , శిక్షణ శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ తో పాటు ఎస్. శ్రీనివాసరావు, కృష్ణా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, విజయవాడ ప్రాంతీయ నైపుణ్య అభివృద్ధి అధికారి , యు.సాయి కుమార్ – పార్వతీపురం మన్యం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, సాయి కృష్ణ చైతన్య – విశాఖపట్నం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, బి.దీప్తి, కర్నూల్ జిల్లా, జి.శ్రీనివాస్, కాకినాడ జిల్లా, రాహుల్, సీనియర్ కన్సల్టెంట్, జె. రవి తేజ యాదవ్, అసోసియేట్ మేనేజర్ ఉన్నారు.

# దేశ అభివృద్ధికి ఇంజనీర్లు ఎంతో అవసరం

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- కే ఎల్ ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేసిన మంత్రి





**విజయవాడ,కలంకౌంటర్ :** కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్ లలో ఇంజనీరింగ్, డిగ్రీ, పి జి కోర్సులలో ప్రవేశానికై జాతీయస్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శుక్రవారం విడుదల చేశారు. విజయవాడ మ్యూజియం రోడ్డులోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కే ఎల్ ప్రవేశ పరీక్షా ఫలితాలను ఆన్ లైన్ ద్వారా విడుదల చేసిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఇంజనీర్లు దేశ అభివృద్ధికి, సమాజ పురోగతికి ఎంతో అవసరమని అన్నారు. ప్రవేశ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించేందుకు కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్షలు నిర్వహించడం హర్షనీయమని అన్నారు. ఉన్నత విద్య చదువుకోవాలనుకునే మెరిట్ విద్యార్థులను మరింతగా ప్రోత్సహించాలని మంత్రి కోరారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించి ఇంజనీరింగ్ విద్యలో ప్రవేశం కల్పించేందుకు కెఎల్ యూనివర్సిటీ జాతీయ స్థాయిలో మూడు దశలుగా పరీక్షలను నిర్వహిస్తుందన్నారు. మొదటి దశలో నిర్వహించిన పరీక్ష ఫలితాలను ఈరోజు విడుదల చేయడం జరిగిందన్నారు. అలాగే రెండవ దశ పరీక్షలను ఫిబ్రవరి 2నుండి 5వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు తాము నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల్లో పాల్గొని ఉత్తమమైన ర్యాంకులు పొందటం ద్వారా కేఎల్ యూనివర్సిటీలో స్కాలర్షిప్ ద్వారా చదివే అవకాశం పొందవచ్చునని ఆయన తెలిపారు. జాతీయ స్థాయిలో ఏటా నిర్వాహస్తున్న పరీక్షల్లో లక్ష మందికి పైగా హాజరువుతున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సెలర్స్ డాక్టర్ ఏ వి ఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు, యూనివర్సిటీ ఈ సి ఈ విభాగం అధిపతి డాక్టర్ సుమన్, అడ్మిషన్స్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్స్ బొబ్బిలి సత్యనారాయణ మూర్తి, హెచ్ ఎస్ ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. యూనివర్సిటీలో ప్రవేశం కోసం ఫిబ్రవరి 2 వ తేదీ నుంచి 6 వ తేదీ వరకు నిర్వహించనున్న పరీక్షల షెడ్యూల్ ను కూడా మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

# దేశ చరిత్రగా నిలిచిన సీఎం జగన్ సంక్షేమ సాహసం : ఎంపీ విజయసాయి రెడ్డి



**అమరావతి,కలంకౌంటర్ :** దేశ చరిత్రలో ఎప్పుడూ, ఎక్కడా జరగని విధంగా ఆంధ్రప్రదేశ్ లో అక్కచెల్లెమ్మలకు ఏకంగా 31.19 లక్షల ఇళ్ల స్థలాలు ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సరికొత్త చరిత్ర సృష్టించారని, ఇది చరిత్ర ఎరుగని సాహసమని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా శుక్రవారం ఆయన పలు అంశాలపై తనదైన శైలిలో స్పందించారు. మొత్తం 31.19 లక్షల ఇళ్ల పట్టాల్లో 22.25 లక్షల గృహ నిర్మాణాలు జరిగినట్లు తెలిపారు. ఇంటి స్థలం, ఇల్లు రూపంలో ప్రతి నిరుపేద కుటుంబానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రూ.20 లక్షల వరకు విలువైన ఆస్తిని అందించారని అన్నారు. నవరత్నాలు పథకం కింద పేదలందరికీ ఇళ్లు అందించడంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పట్ల లబ్ధిదారులు మిక్కిలి కృతజ్ఞతా భావంతో ఉన్నారని తెలిపారు.

**సామాజిక న్యాయానికి చిహ్నంగా అంబేద్కర్ విగ్రహం :** విజయ-ంవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన భారతరత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అద్భుతమైన విగ్రహం సామాజిక న్యాయానికి చిహ్నంగా విరాజిల్లుతుందని విజయసాయి రెడ్డి అన్నారు. ఈ విగ్రహం ఆయన వారసత్వాన్ని, అతని స్ఫూర్తిదాయకమైన ఆదర్శాలను అనుసరిస్తున్న జగన్ ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన బాటలో సీఎం జగన్ కొనసాగిస్తున్న పాలన ఫలితంగా దళితులు, బడుగు బలహీన వర్గాల ప్రజలు విద్య, ఆర్థిక, రాజకీయ సాధికారతతో రాణిస్తున్నారని అన్నారు. దేశంలోనే అద్భుత కళాఖండంగా రూపొందించిన సామాజిక న్యాయ మహా శిల్పం (అంబేద్కర్ భారీ విగ్రహం) సీఎం జగన్ శుక్రవారం ఆవిష్కరించి జాతికి అంకితం చేశారని అన్నారు.

**విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాలు పెంచాలి :** దేశవ్యాప్తంగా విమానాశ్రయ మౌలిక సదుపాయాలను పెంచాల్సిన తక్షణ ఆవశ్యకత స్పష్టంగా కనిపిస్తోందని వెయిటింగ్ సమయాన్ని పొడిగించడం, ఆహారం, ప్రయాణ సౌకర్యాల కోసం అధిక ఛార్జీలు లక్షలాది మంది విమాన ప్రయాణికులపై ప్రభావం చూపిస్తున్నాయని అన్నారు. ప్రయాణీకులు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలని విమానయాన శాఖ మంత్రి జేఎం సింధియాకు అభ్యర్థిస్తున్నానని విజయసాయి రెడ్డి అన్నారు.

# త్రాగునీటి పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

- గ్రామాలలో త్రాగునీరు, పరిశుభ్రత ప్రధాన అంశాలు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే.ఎస్. జవహర్ రెడ్డి
- శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జరుగుతున్న హెల్తీ విలేజ్ జాతీయ వర్క్ షాప్



**తిరుపతి ,కలంకౌంటర్ :** హెల్తీ విలేజ్లో ప్రధాన అంశాలుగా త్రాగునీరు పరిశుభ్రతపై పంచాయతీరాజ్ వ్యవస్థ, సర్పంచ్ లు దృష్టి పెట్టాలని గతంలో పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేసిన అనుభవంతో చెబుతున్నానని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే.ఎస్. జవహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జరుగుతున్న హెల్తీ విలేజ్ జాతీయ వర్క్ షాప్ 2 వ రోజు అంశం రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ గ్రామీణ సేవల అంశాలపై నిర్వహణతో ప్రారంభం కాగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముఖ్య అతిథిగా పాల్గొనగా వివిధ శాఖల కమిషనర్లు ఉన్నతాధికారులు వారికి సంబంధించిన శాఖలలో అమలు చేస్తున్న అంశాలను సభను ఉద్దేశించి ప్రసంగించారు. గ్రామాలలో త్రాగునీరు, పరిశుభ్రత ప్రధాన అంశాలని వాటిని మనం అధిగమించాలని అన్నారు. త్రాగు నీటి విషయంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామని అన్నారు. గ్రామపంచాయతీలు వీటిని సద్వినియోగం చేసుకొని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేపట్టినప్పుడే పరి శుభ్ర త్రాగునీరు విజయవంతంగా అమలు చేయగలుగుతామని అన్నారు. గ్రామాలలో పరిశుభ్రత ఇప్పటికే ప్రతి ఇంటికి స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా మరుగుదొడ్లు నిర్మించుకొని ఓడిఎఫ్ ం లో కి వెళ్లేమని అన్నారు. గ్రామ పంచాయతీలలో మురికి కాలువల నిర్మాణం వల్ల నిర్వహణ పంచాయితీలకు భారంగా మారుతుందని, సర్పంచులు దృష్టి పెట్టి భూగర్భ డ్రైనేజ్ పైపులైన్ ద్వారా నిర్మాణం చేపడితే సమస్యలు తలెత్తవన్నారు. మరుగుదొడ్లకు సంబంధించి ఆయా గృహాలలో సోక్ పిట్స్ ఏర్పాటు చేసి ఆనీరు కలవకుండా జాగ్రత్తలు తీసుకొని గ్రే వాటర్ అంటే బాత్రూం నీళ్లు మాత్రమే అనుసంధానం చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్లో అద్భుతమైన సచివాలయ వ్యవస్థ ఏర్పాటు జరిగిందని, 2వేల మంది జనాభాకు ఒక సచివాలయం అందుబాటులోకి తెచ్చామన్నారు. సంక్షేమ పథకాలు సచివాలయ స్థాయిలో అందించే విధంగా చేపట్టామని అన్నారు. వాలంటరీ వ్యవస్థ ఏర్పాటుతో ప్రతి 50 కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు వివరించి అర్హత కలవారికి అందించేలా వ్యవస్థ రూపొందించామని , కోవిడ్ సమయంలో వీరి సేవలు చాలా ఉపయోగపడ్డాయన్నారు. వైయస్సార్ విలేజ్ క్లినిక్స్ సచివాలయ స్థాయిలో ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు రవాణా ఆర్థిక భారం తగ్గేలా వైద్య సేవలు అందించడానికి 24/7 అందుబాటులో ఉండేలా చేపట్టామన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ స్థాయిలోనే అసంక్రమిత వ్యాధులను గుర్తించేందుకు 14 రకాల వైద్య పరీక్షలు ఇక్కడే నిర్వహించి మందులు అందించడం జరుగుతున్నదని అన్నారు. ప్రజల ఆరోగ్య విషయంలో మరో ముందడుగు వేసి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానంతో ఇంటింటి వైద్యం , జగనన్న ఆరోగ్య సురక్ష తో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించడం, అవసరాన్ని బట్టి ఆరోగ్యశ్రీ ద్వారా నెట్వర్క్ హాస్పిటల్స్ కు రెఫర్ చేయడం వంటివి చేస్తున్నామని అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన విషయంలో గర్భిణీ స్త్రీలకు, 10 నుండి 19 వయసు కల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి రక్తహీనత తగ్గించే విధంగా పోషకాహారం అందించడం, పాఠశాలలలో రాగిజావ తో పాటు జగనన్న గోరుముద్ద పేరుతో మధ్యాహ్నం భోజనం పౌష్టికాహారం అందిస్తున్నామని వివరించారు. ప్రతి గ్రామానికి ఫైబర్ నెట్ అనుసంధానం చేశామని, సచివాలయ స్థాయిలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించే విధంగా ఏర్పాటు జరిగిందని వివరించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ సూర్యకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయాల ఏర్పాటుతో 1.4 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని, గ్రామస్థాయిలోనే సిటిజన్ సర్వీసులు లతోపాటు 88 రకాల ప్రభుత్వ సేవలు ప్రస్తుతం అందించే ఏర్పాటు చేశామని అన్నారు. గ్రామాలలో పరిశుభ్రత, త్రాగునీటి సౌకర్యం , వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణ చేపట్టి పంచాయతీలకు ఆదాయం తెచ్చేలా చేస్తున్నామని అన్నారు. సచివాలయ వ్యవస్థలో పంచాయతీ సెక్రెటరీ , డిజిటల్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్ ,వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ అసిస్టెంట్ ,ఎనర్జీ అసిస్టెంట్ వెటర్నరీ, ఫిషరీస్ అసిస్టెంట్ , రెవిన్యూ సెక్రెటరీ వంటి పోస్టులను నియమించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శిని నియమించి మహిళలకు అండగా, బాల్యవివాహాల నిషేధం దిశగా అందుబాటులోకి తెచ్చామని వివరించారు. అంగన్వాడీలలో గర్భిణీ స్త్రీలకు చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించడం, పిల్లలలో ఎదుగుదల పరీక్షల నిర్వహించి ఎప్పటికప్పుడు వైద్య శాఖ సహకారంతో వైద్య సేవలు అందించి ఆరోగ్యంగా ఉంచడం చేపడుతున్నామని వివరించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ జె .నివాస్ వివరిస్తూ గ్రామాలలో హెల్త్ క్లినికల్ ఏర్పాటుతోపాటు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ టెలిమెడిసిన్ సౌకర్యం కల్పించి దేశంలోనే అధికంగా టెలిమేడిసన్ వైద్య సేవలు అందించిన ప్రభుత్వంగా ఆంధ్రప్రదేశ్ ముందుందని అన్నారు. ఎక్కడలేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు చేసి ప్రతి సచివాలయ పరిధిలో ప్రతి నెలకు రెండుసార్లు 104 వాహనం పర్యటించి ఉ.9 నుండి సా.4 గంటల వరకు ఓపి సేవలు, వైద్య సేవలు ,మందుల పంపిణీ వంటివి చేపట్టడం జరుగుతున్నదన్నారు . వీటితోపాటు అంగన్వాడీలలో పాఠశాలలలో వైద్య పరీక్షలు నిర్వహించడం, బెడ్ రీడన్ వారికి వైద్య సేవలు జరుగుతుందని అన్నారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు తాము అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులు గ్రూపుగా ఏర్పడి ఒక్కొక్క అంశంపై తమ అభిప్రాయాలను సభ వేదికగా అన్ని రాష్ట్రాల వారు వివరించారు.



యోగి వేమన జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన సీఎం వైఎస్ జగన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి. విజయసాయి రెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి.

–అమరావతి,కలంకౌంటర్ :

# ఒక్క ఛాన్స్ అంటే నమ్మి మోసపోయాం

- దొంగ ఓట్ల అక్రమాలకు మూల్యం చెల్లించక తప్పదు
- టీడీఆర్ బాండ్ల అవినీతిని వెలికితీస్తాం
- రెడ్ శాండల్ స్మగ్లర్లకు రెడ్ కార్పెట్టా ?
- జగనన్న బాణం రివర్స్ అయింది
- తిరుపతి జిల్లా వెంకటగిరిలో నిర్వహించిన 'రా కదలిరా' సభలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు





**తిరుపతి,కలంకౌంటర్ :** తిరుపతి జిల్లా వెంకటగిరిలో నిర్వహించిన 'రా కదలిరా' సభలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సీఎం జగన్ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శిశుపాలుడు 100 తప్పులు చేస్తే జగన్ 1000 తప్పులు చేశాడని మండిపడ్డారు. జగన్ విశ్వసనీయత పెద్ద ఫార్స్ అని విమర్శించారు. హోదా తెచ్చాడా, సీపీఎస్ రద్దు చేశాడా, మద్యపాన నిషేధం చేశాడా..ఏం చేశాడని విశ్వసనీయత గురించి చెప్పుకుంటున్నాడు? అని నిలదీశారు. ఎర్రచందనం స్మగ్లర్ లకు అసెంబ్లీ టిక్కెట్లా? ప్రజలు ఆలోచించాలని చంద్రబాబు పేర్కొన్నారు. దొంగ ఓట్ల అక్రమాలకు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

**నేడు అన్నీ పోయాయి :** చెన్నైతో తిరుపతి, నెల్లూరుని లింక్ చేసి హబ్ గా చేయాలనుకున్నాం. వీటిని కనెక్ట్ చేస్తూ రోడ్లని వేశాం. తిరుపతిని ఎలక్ట్రానిక్ హబ్ గా చేశాం. సెల్ కాన్, కార్బన్, డెక్కన్ వంటి అనేక కంపెనీలు తిరుపతికి తెచ్చాం. అక్కడ కంపెనీల్లో పని చేయించుకునేందుకు వెంకటగిరి నుంచి యువతను బస్సులో తీసుకువెళ్లుతున్నారు. హీరో మోటార్స్, అపోలో టైర్లు, రిపబ్లిక్ ఫోర్స్ తో శ్రీ సిటీలో పెట్టి యువతకు ఉద్యోగాలు ఇచ్చాం. దేశంలోనే మంచి సంస్థలను తీసుకువచ్చాం. కాని నేడు అన్నీ పోయాయన్నారు.

**టీడీఆర్ బాండ్ల అవినీతిని వెలికితీస్తాం :** తిరుమల భక్తుల కోసం రూ.630 కోట్లతో గరుడ వారధి తీసుకువస్తే జగన్ గంజాయి తెచ్చారు. మనం ఒక టెంపుల్ సిటీగా ప్రమోట్ చేస్తే జగన్ దొంగ ఓట్ల సంస్కృతి తెచ్చారు. నాడు రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు తెస్తే జగన్ 24 శాతం నిరుద్యోగం పెంచారు. జాబ్ క్యాలెండర్ వచ్చిందా? మనం దక్షిణ కొరియా ప్రభుత్వంతో మాట్లాడి కియా లాంటి కారు పరిశ్రమను తీసుకువస్తే జగన్ మాత్రం అమర్ రాజాను తరిమేశారు. టీడీఆర్ బాండ్స్ లో రూ.25 వేల కోట్ల అక్రమాలు జరిగాయి. టీడీపీ అధికారంలోకి వస్తే ఎంక్వైరీ వేసి తప్పు చేసిన వాళ్లందరిని శిక్షిస్తామన్నారు.

**రెడ్ శాండల్ స్మగ్లర్లకు రెడ్ కార్పెట్టా ? :** ఎర్రచందనం వైసీపీ నాయకులకు ఆర్థిక వనరుగా మారింది. ఎర్రచందనం స్మగ్లర్లకు రెడ్ కార్పెట్ వేస్తున్నారు. రూ.7,500 కోట్లు దోపిడీ చేశారు. నాడు మేం ఎర్రచందనాన్ని ఉక్కుపాదంతో అణచివేశాం. నేడు సాక్షాత్తు స్మగ్లర్ కే చిత్తూరు ఎమ్మెల్యే సీటు ఇచ్చారు. తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని అపవిత్రం చేస్తున్నారు. ఆయనకు అపచారం చేస్తే ఆ దేవుడు మిమ్మల్ని వదలిపెట్టరు. కొండపై అన్నదానం బాగుందా? ఎన్టీఆర్ అన్నదానాన్ని ప్రారంభించారు.

**దొంగ ఓట్లకు పాల్పడిన అధికారులకు శిక్షలు తప్పవు :** ఏ పాలకుడైనా అభివృద్ధి చూసి ఓట్లు అడుగుతారు. కాని ఈ దుర్మార్గుడు మాత్రం ఓట్ల విధ్వంసం చేశారు. చంద్రగిరి నియోజకవర్గంలో లక్షా 15వేల దొంగ ఓట్లు చేర్చారు. దానికి జగన్ వత్తాసు పలుకుతున్నారు. దొంగ ఓట్లకు పాల్పడుతున్న అధికారులకు శిక్షలు పడుతున్నాయి. కోర్టులో కేసును వెనక్కి తీసుకోమని ఇప్పుడు పనబాక లక్ష్మి ఇంటికి అధికారులు క్యూలు కడుతున్నారు. కేసు వెనక్కి తీసుకునే పరిస్థితి లేదు. మిమ్మల్ని బోన్ ఎక్కించే బాధ్యత టీడీపీ తీసుకుంటుంది. దొంగ ఓట్లతో మనుషులు బ్రతికి ఉండగానే చంపేస్తున్నారు. ఇటువంటి దుర్మార్గులకు శిక్షలు తప్పవన్నారు.



**ఒక్క ఛాన్స్ అంటే నమ్మి మోసపోయాం :** జగనన్న బాణం రివర్స్ అయింది. కారణమేంటి ? ఇదేనా విశ్వసనీయత? జగన్ రెడ్డి విశ్వసనీయత ఎలాంటిదంటే 29 మంది దళిత ఎమ్మెల్యేలను మార్చాడు. మోసం చేసి ఓట్లు వేయించుకుని మరోసారి రాజకీయ కుట్రకు తెరలేపాడు. మోసం చేసి ఓట్లు వేయించుకోవాలని అనుకుంటున్నాడు. కనకపు సింహాసనమున శునకమును కూర్చుండబెట్టినా.. దాని వెనుకటి గుణములు మరచిపోదు. ఫ్యాక్షనిస్టు, నేరస్తుడు, మానసిక రోగి అని తెలిసినా.. నెత్తిన చెయ్యి పెట్టి ఒక్క ఛాన్స్ అనగానే ఐస్ అయిపోయి ఓట్లేశాం. చివరికి అందరం నష్టపోయాం.

**క్లబ్బు డ్యాన్సర్లు కూడా మహిళా సంక్షేమం గురించి మాట్లాడడమా :** వెంకటగిరికి వచ్చిన కొత్త బిచ్చగాడు. పెన్నా నదిలో ఇసుక వదలడు. తెల్ల రాయి వదలడు. మొలకలకొండలో కొండలు తవ్వేశాడు. భూములు కబ్జాలు చేస్తున్నాడు. ఇసుక, మద్యం, గంజాయి, క్రికెట్ బెట్టింగుల్లో కలివేటి సిద్ధహస్తుడు. జగన్ రెడ్డి స్ఫూర్తితో స్థానిక ఎమ్మెల్యే అంతకు మించి అన్నట్లు వ్యవహరిస్తున్నాడు. గూడూరులో ఎమ్మెల్యే వర ప్రసాద్ ఇసుక, సిలికా దోపిడీ తేల్చాలంటే పుస్తకాలు సరిపోవు. క్లబ్బు డాన్సర్లు కూడా మహిళా సంక్షేమం గురించి మాట్లాడుతున్నారు.

**ఇతనొక మంత్రి :** కోర్టుల్లోని సాక్ష్యాలు కూడా కొట్టేసే కాకాణి ఒక మంత్రి. మద్యం, గ్రావెల్ దోపిడీతో జిల్లాను సైతం కొనేసే స్థాయిలో వెనకేసుకున్నాడు. మైనింగ్ పుడింగి దోపిడీకి రాష్ట్రంలోని మైన్స్ అన్నీ బెంబేలెత్తుతున్నాయి. రేణిగుంటను కూతురికి, ఏర్పేడు తమ్ముడికి పంచేశారు. కాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి ఆక్రమించుకున్నారు. ఏడు కొండల వాడిని సైతం దోచుకునే వ్యక్తి భూమన కరుణాకర్ రెడ్డి. ఇంతటి దుర్మార్గులొస్తారని ఎప్పుడూ ఆలోచించలేదు. ప్రశాంతమైన చిత్తూరులో ఇలాంటి దుర్మార్గులు అధికారంలోకి రాకూడదన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని తాకే అర్హత జగన్ కు లేదు : యార్లగడ్డ



**గన్నవరం,కలంకౌంటర్ :** దేశ ప్రజలు స్వేచ్ఛాయుతంగా బతికేందుకు అవసరమైన రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు అంబేద్కర్ అని ఆయన విగ్రహాన్ని తాకే అర్హత కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ రెడ్డి కి లేదని గన్నవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు విమర్శించారు. రాష్ట్రంలో ఎస్సీ ల పై దాడులు చేస్తూ వారికి అమలు అవుతున్న సంక్షేమ పథకాలు రద్దు చేసి అన్ని రకాలుగా ఎస్సీలను అణగదొక్కుతున్న ఈ ముఖ్యమంత్రికి అంబేద్కర్ గారి విగ్రహాన్ని ప్రారంభించే అర్హత లేదని శుక్రవారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. మహనీయుడు రాసిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తున్న జగన్ కు అంబేద్కర్ పేరు ఎత్తే అర్హత లేదని నిప్పులు చెరిగారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్ళించారని, 27 రకాల సంక్షేమ పథకాలు నిలిపివేశారని, ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం చేసి ఎస్సీ యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని యార్లగడ్డ ఆరోపించారు. టిడిపి ప్రభుత్వం హయాంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 4 లక్షల మంది ఎస్సీ యువత ఉపాధి అవకాశాలు కల్పించగా, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాన్ని రద్దు చేశారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఆరువేల మంది ఎస్సీలపై దాడులు జరగా 188 మందిని దారుణంగా చంపేశారని, ఇవన్నీ ప్రభుత్వ హత్యలే అని ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. 2019–22 మధ్య కాలంలో 1294 మంది ఎస్సీ ఎస్టీ మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీల కోసం టీడీపీ హయాంలో ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు చేసిన విదేశీ విద్యా పథకానికి అంబేద్కర్ పేరుని తొలగించటం చుస్తే అంబేద్కర్ పట్ల మీకున్న అభిమానానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. దళితులపై దాడులు చేస్తూ విగ్రహాలు ఓపెన్ చేస్తే చేసిన పాపాలు పోవని హితవు పలికారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా రాష్ట్రంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేయాలని వెంకట్రావ్ డిమాండ్ చేశారు.

# పోరాటానికి రూపమే అంబేద్కర్





(మొదటి పేజీ తరువాయి)

చులకన. పెత్తందారీ పార్టీలకు, పెత్తందారి నేతలకు పేదలు అవసరం లేదు. రియల్ ఎస్టేట్ రాజధాని కోసం పేదల భూములు లాక్కున్నారు. రాష్ట్రాన్ని దోచుకోవడమే పెత్తందారుల లక్ష్యం. గతంలో చంద్రబాబు ఎందుకు బటన్ నొక్కలేకపోయారు. చంద్రబాబు ఎందుకు సామాజిక న్యాయం అమలు చేయలేకపోయారని సీఎం జగన్ ధ్వజమెత్తారు.

**ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..** విజయవాడ స్వరాజ్య మైదాన్ లో ఏర్పాటు చేసిన 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహాన్ని ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయ మహాశిల్పం పేరిట అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అందరినీ ఒక్కతాటిపై తీసుకురావడానికి అంబేద్కరే స్ఫూర్తి అని పేర్కొన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహం ప్రపంచంలోని ఇతర అంబేద్కర్ విగ్రహాలన్నింటి కంటే పెద్దది అని వెల్లడించారు. స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ కు ఇకపై విజయవాడ చిరునామాగా మారుతుందని పేర్కొన్నారు. ఈ మహా విగ్రహం అందరికీ స్ఫూర్తిదాయకం అని, కానీ పెత్తందారుల పత్రికలు చరిత్రను కూడా వక్రీకరిస్తున్నాయని సీఎం జగన్ విమర్శించారు. అంబేద్కర్ భావజాలం పెత్తందార్లకు నచ్చదని అన్నారు. దళిత, బలహీన వర్గాలపై చంద్రబాబుకు ప్రేమ లేదని విమర్శించారు.

**పూర్తిగా మేడిన్ ఇండియా :** విజయవాడలో నెలకొల్పిన అంబేద్కర్ విగ్రహాన్ని పూర్తిగా స్వదేశీ వస్తువులతోనే రూపొందించారు. ఇందుకోసం రూ.404.35 కోట్లు ఖర్చు చేశారు. 18.18 ఎకరాల్లో ఈ భారీ ప్రాజెక్టు నిర్మించారు. దీంట్లో అంబేద్కర్ పీఠం 81 అడుగులు కాగా, ప్రధాన విగ్రహం 125 అడుగుల ఎత్తు ఉంటుంది. పీఠంపై జీ ప్లస్ 2 తరహాలో గదులు నిర్మించారు. పీఠాన్ని బౌద్ధ మత కాలచక్ర మహామండపం తరహాలో తీర్చిదిద్దారు. ఇక్కడ అంబేద్కర్ జీవిత విశేషాలతో కూడిన ప్రత్యేక కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. అంతేకాదు, రెండు వేల మంది సామర్థ్యంతో కూడిన కన్వెన్షన్ సెంటర్ కూడా ఉంది.













Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com